


# ప్రాయశ్చిత్తం

ఎస్. వి. రంగారావు

సాయంకాలం 5-30 అవుతుంది. గోదావరి మీదనుంచి చల్లని గాలి వీస్తూంది. ఆ గాలిని ఆనందిస్తూ తల లూపుతున్నాయి మొక్కజొన్నలు.

గుఱ్ఱపుబండిమీద షికారుకు బయలుదేరాడు ప్రకాశరావు. అతను ఆ వూరు జమీందారుగారి ఏకైక పుత్రుడు. తల్లి చిన్నతనంలోనే పోవడంచేత అతి గారాబంతో పెంచాడు తండ్రి. స్కూలుకూ, కాలేజీకి పంపకుండా యింట్లోనే చదువు చెప్పించి సీనియర్ కేంబ్రిడ్జి కూడా ప్యాస్ చేయించారు. అందుచేత ప్రకాశరావుకు పుస్తకాలు తప్ప మరో ప్రపంచం తెలీదు. తండ్రితో ఏ ఒక సారో రెండుసార్లో కాకినాడ వెళ్ళాడు, అంతే. అదే అతనికి చాలా బెదురు అనిపించింది. అటు రాజమండ్రి, ఇటు కాకినాడ తప్ప మరొక పట్టణం అత నెప్పుడూ చూడలేదు. అందుచే తనుకుంటా అతనిలో ఒక ఆత్మసంతృప్తి యేర్పడింది.

షికారు నుంచి తిరిగి వస్తున్నాడు ప్రకాశరావు. చీకటిపడుతూవుంది. అందుచేత బండిని త్వరగా తోలమని చెప్పి వెనక్కి ఆనుకుని కళ్ళు మూసుకొని మొక్కజొన్న తోటల మీద నుంచి వస్తున్న పిల్లగాలిని ఆస్వాదిస్తున్నాడు ప్రకాశరావు. బండి ఒక్కసారిగా ఆగడం చేత వెనకకు ఆనుకుని కూర్చున్నవాడల్లా ముందుకు విసిరివేయబడ్డాడు. ఎదురుగుండా వున్న చెక్కకు తల తగిలి కాస్త గాయం పడింది. రక్తం కారుతోంది. బండివాడు యెవరినో తిడుతున్నాడు.

"ఏం అమ్మాయి, కాస్త చూసుకొని నడవకూడదూ, బండిరావడం కనిపించడం లేదా లేక కళ్ళులేవా ?"

"నేను చూడలేదయ్యా క్షమించండి."

కంఠస్వరం అతిమధురంగా వినిపించింది ప్రకాశరావుకి. తొంగి చూసాడు. పద్దెనిమిది సంవత్సరాలుంటాయి. బంగారు ఛాయ, నెత్తిన కుంకం బొట్టు, వంటిని అంటుకొని వున్న తడి చీరా. సాయంకాలం, కృంగిపోతున్న సూర్యుని ఆఖరి చూపుల కావిరంగులో, మిల మిలా మెరిసిందా పిల్ల.

బండివాడు యింకా తిడుతూనే వున్నాడు. "పోనీలే వూరుకోవోయి. చూడలేదమో'' అన్నాడు బండివాడ్ని.

సుగుణ అనుకోకుండా ఆ వైపుకు చూసింది. ప్రకాశరావు నొసటి నుండి సన్నటి నెత్తురుధార కారడం చూసి భయపడింది. కాని పరపురుషుడు. ఎలా మాట్లాడాలో తెలియక అలా కళ్ళప్పజెప్పి అతనికేసి చూస్తూ నిలుచుండిపోయింది. ప్రకాశరావు కూడ ఆమె అందాన్ని చూస్తూ అలాగే వుండిపోయాడు. బండివాడుకూడా వీళ్ళిద్దరినీ చూస్తూ అలాగే వుండిపోయాడు. కొంతసేపటికి తెప్పరిల్లి "బాబూ! వెళదామా" అని అడిగాడు. పోనియ్యమన్నాడు ప్రకాశరావు. క్రింద పడిన బింది తీసుకొని మళ్ళీ గోదావరికేసి వెళ్ళిపోయింది సుగుణ, బరువెక్కిన హృదయంతో.

బండి నడుస్తూనే వుంది. ఆందోళనలో పడ్డాడు ప్రకాశరావు. నొసటి దెబ్బ తుడుచుకోగలిగాడు కాని హృదయంలో యేదో అర్థం కాని బాధ ప్రవేశించింది. వళ్ళంతా యేదో చలిజ్వరం వచ్చినట్లుంది.

ఇంటికి రాగానే బండివాడు జమీందారు మురళీధరరావుగారికి జరిగిన విషయం తెలియచేశాడు. దెబ్బ తగిలినంత వరకు మాత్రమే చాలా గాభరా పడ్డారు జమీందారుగారు. పక్క వూరిలో వున్న కమ్మరి చంద్రయ్యకు వైద్యం తెలుసు. అతనిని పిలిపించారు.

"ఏం ఫరవాలేదుబాబూ, తొందరగానే మానిపోతుంది,'' అని ఏదో ఆకుపసరు రాసి కట్టు గట్టాడు. ప్రకాశరావు. రాత్రంతా నిద్ర పట్టక వరండాలో తిరుగుతూనే వున్నాడు. జమీందారుగారు రెండు మూడుసార్లు తన గదిలోకి వచ్చి "ఏం నాయనా, నిద్ర పట్టటంలేదా" అని అడిగారు. అవునని చెప్పాడుప్రకాశరావు. పాపం దెబ్బ బాధగా వుంది కాబోలనుకున్నారు జమీందారుగారు. ప్రకాశరావు హృదయంలోని బాధ ఆయనకేమి తెలుసు.

పార్వతీశంగారు ఆవూళ్ళోనే పోస్టుమాస్టర్ చేసి రిటైర్ అయ్యారు. ఆవూరు చిన్న వూరే ఐనా అన్నివిధాలా సదుపాయంగా వుండడం చేత అక్కడే సెటిల్ అవుదామని నిర్ణయించుకొని జమీందారుగారిని ప్రాధేయపడి కాస్త స్థలం తీసుకొని ఒక చిన్న రెండగదుల పెంకుటిల్లు వేసుకొని పెన్షన్ డబ్బులతో కాలక్షేపం చేస్తున్నాడాయన. సుగుణ ఒకత్తే కూతురు. పదహారవ యేట పెండ్లి చేశాడు. కాని లెఫ్టినెంట్ రమేష్ ఇంటికి తిరిగి రాకుండానే అస్సాములో సమాధి అయ్యాడు. భర్త సంపర్కం కూడా లేని సుగుణ భర్త వియోగానికి అట్టే యేడవనుకూడా లేకపోయింది, కాని తల్లిదండ్రులు వద్దంటున్నా బొట్టు మాత్రం పెట్టుకుంటూనే వుండేది. అంచేత వుళ్ళో కొంతమంది వాళ్ళను వెలివేసినట్టుగా వుంచేవారు. ఒకటి రెండు సార్లు జమీందారుగారు కూడా యీ విషయమై మాట్లాడారు. కాని యెలాగో జీవితం గడిచిపోతుంది. సుగుణ మాత్రం తన అలవాటు మానలేదు.

మరునాడు సాయంత్రం అదే సమయానికి ప్రకాశరావు గుఱ్ఱబ్బండి మీద షికారుకు వచ్చాడు. కాని ఈ రోజు తనే బండి తోలుకుంటూ వచ్చాడు. కొంచం మసకచీకటిగా వుంది. బండి దిగి కొంత దూరం నడిచి సరిగ్గా నిన్న సుగుణను కలుసుకొన్న చోటుకు వచ్చి ఫర్లాంగు రాయి మీద కూర్చున్నాడు. సుగుణ నీళ్ళ బిందితో రావడం చూసి చెట్టు చాటుకు పోయి దాక్కున్నాడు; బెదురు గుండె మరి. సుగుణ మామూలుగానే వచ్చింది; కాని ఆ స్థలానికి వచ్చేసరికి కాస్త ఆగాలనిపించింది. తలెత్తిచూసింది. తనలో నవ్వుకొని బయలుదేర పోతూండగా కొంత దూరంలో బండి ఆగి వుండడం చూసింది. తనకు తెలియని భయమేదో మనసులో పుట్టి గబగబా నడవసాగింది.

"చూడండీ ...మిమ్మల్నే ..."

"పాపం, నిన్న మిమ్మల్ని మా బండివాడు తిట్టాడుకదూ! క్షమించండి. వాడు వట్టి మోటువాడు-''అన్నాడు ప్రకాశం.

సుగుణ తలెత్తి కోపంగా చూడబోయింది అతనికేసి. కాని తలమీద కట్టు చూసేసరికి ముఖం జాలిగా మారిపోయింది. మాటలు వాటంతటవే దొర్లిపోయాయి. "నా మూలాన్న మీకే గాయం తగిలింది. అందుకే మీ బండివాడు తిట్టాడు; ఫరవాలేదులెండి. మీ గాయం ఎట్లా వుంది'' అని అడిగింది.

'ఫరవాలేదులెండి. అదే మానిపోతుం' దన్నాడు.

మాట్లాడుతూనే నడుస్తున్నారు యిద్దరూను. కొంతసేపటికి యెవరన్నా చూస్తారేమోనన్న సంగతి జ్ఞాపకం వచ్చిందతనికి. వెంటనే భయంకూడా వేసింది. చూసి నాన్నగారికి చెబితే, ఇంకేమయినా వుందా. మళ్ళీ రేపు కలుసుకుంటా నని చెప్పి గబగబా వెళ్ళిపోయాడు.

పరిచయం ముదిరి ప్రేమగా మారింది. ఒక వెన్నెల రాత్రి యెవరికీ తెలియకుండా యిద్దరూ దొంగతనంగా మొక్కజొన్న తోటలో కలుసుకోవడం కూడా జరిగింది. సంఘం కట్టుబాట్లవల్ల సుఖానికి దూరమైనది ఒకరు, ఇంట్లో అనవసరపు కట్టుబాట్లవల్ల సుఖమనేదానికి అర్థమే తెలియనిది ఒకరు. ప్రేమ అనేది దొంగతనమో దొరతనమో తెలుసుకోలేని ఆ అమాయకపు హృదయాలు వెన్నెలలో, మొక్కజొన్న తోటలో, మంచె కింద కలుసుకొని మైమరిచిపోయాయి.

రెండు నెలల నుండి తనను పిలవకుండా చిన్నయ్యగారే బండి తోలుకెళ్ళడం ఏమీ నచ్చలేదు బండివాడు సుబ్బన్నకి. ఉండబట్టలేక అడిగేసాడు. 'ఏం బాబూ, నాకు తెలీకూడదనా మీ షికార్లు తోటలో. చూసాన్లెండి. మీ సంగతంతా అసలు యెవరికంట పడకూడదో వాడికే ముందు తెలిసింది.' ఇంకేట్లా. మెల్లిగా డబ్బాశ చూపి, వల్లో వేసుకున్నాడు సుబ్బన్నని. అంతేగాదు, వాడితోనే సుగుణకు చాటుగా కబుర్లు పంపడంకూడా అలవాటయిపోయింది.

సుగుణ పరిస్థితికూడా అంతే. పగలల్లా నిట్టూర్పుతో కాలం గడుపుతూ చీకటి పడ్డాక ముసలి తలిదండ్రులు నిద్రపోయాక ఎవరి కంటా పడకుండా వెళ్ళి ప్రకాశాన్ని కలుసుకోవడం జరిగిపోతోంది.




"నా పేరా ?...నన్ను గుండమ్మ మొగు డంటారు !"

## 2

ఊరంతా ఒక్కసారి ఘొల్లుమంది. వెధవముండకి కడు పొచ్చింది. ఇంకేముంది - ఆటంబాంబు పడినంత ఆందోళన ప్రారంభమయింది. ఆడిపోసుకొనే అమ్మలక్కల కనర్గళమైన అవకాశం లభించింది.

పార్వతీశం గాని, తల్లి గాని బయటకు పోవడం మానేసారు. సుగుణను ఇంట్లోనుంచి బయటకు అడుగు పెట్టకుండా బందోబస్తు చేశారు. ఇంటిముందునుంచి నడిచే పెద్దలంతా ఒకసారి యింటికేసి చూసి ఖాండ్రించి వుమ్మిగాని పోవటం లేదు. ఎన్నడూ ఆ వైపున నడవని పతివ్రతలంతా పనిగట్టుకొని ఆ వైపుకు రావడం, ముఖాలు చిట్లించుకోవడం సుగుణ కిటికీలోంచి చూస్తూనేవుంది.

సుబ్బన్నతో అనేకసార్లు కబురు పంపింది, కాని ప్రకాశరావు రాలేదు. సుగుణకు కడు పొచ్చింది కాబట్టి ఆమె వ్యభిచరించిం దని ప్రపంచం యీసడించుకుంటుంది. కాని ప్రకాశరావుకు ఏమీ రాదుగా. అందులోనూ చిన్నప్పటినుంచీ తండ్రిచాటున పెరిగినవాడు, భయభక్తులు అతనిలో జీర్ణించిపోయివున్నాయి. అది అందరికి తెలిసిన విషయమే. అయినా జమీందారుగారి సుపుత్రునికి అంతటి నీచం ఆపాదించలేకపోయింది గుడ్డి ప్రజ. ఐనా సుబ్బన్నకి తప్ప ఆ సంగతి మరెవరికీ తెలియదాయె. ప్రకాశానికి ఈ సంగతి తెలిసి, అసలు బయటకు వెళ్ళడమే మానుకున్నాడు. వర్షాకాలం అవడంచేత యింట్లోనే వుంటున్నా డని తండ్రిగారనుకొని సంతోషపడ్డారు.

సుగుణ పరిస్థితి దుర్భరంగా వుంది. ఇంట్లో తిట్లు పడలేకపోయింది. తల్లి దండ్రులంటే అంత బాధ అనిపించేది కాదు. పని గట్టుకొని యింటికి వచ్చి తిట్టిపోతూండేవారు, సదవకాశాలు దొరకని కొందరు పూర్వ సువాసినులు. నామధేయమైనా చెప్పమని అడిగాడు పార్వతీశంగారు. ససేమిరా చెప్పనంది, ప్రకాశం యిచ్చిన వాగ్దానాన్ని మనసులో పెట్టుకొని.

ఆరవనెల వచ్చింది. బయట తలెత్తుకోలేని పరిస్థితులలో. రాబోయే అవాంతరాన్ని మనసులో తలచుకొని అదిరిపోయేవాడు పార్వతీశంగారు. ప్రకాశరావు జాడే లేదు. బహుశా తనని మరిచిపోయాడేమో. అసలు రెండు నెలలనుంచీ సుబ్బన్న కూడా రావడం మానేశాడు. సుగుణకు కన్నీరు తప్ప వేరే గత్యంతరం లేదు. అదే ఒక ఓదార్పుగా తయారయింది ఆమెకు. అలాగే యేడ్చి యేడ్చి మగతగా నిద్రపోయిం దో రాత్రి.

తెల్లవారింది. కాకుల అలజడికి కళ్ళు తెరిచింది సుగుణ. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అమ్మా అని పిలిచింది భయంగానే; సమాధానం లేదు. ఇంట్లో తల్లిగాని, తండ్రిగాని లేరు. అమ్మా, నాన్నా అంటూ కేకలు పెట్టింది. సమాధానం లేదు. అంతా శూన్యంగా వుంది. గూట్లో వున్న ఉత్తరం కనిపించింది.

తల్లీ, సుగుణా:

మా జీవితంలో యింతవరకూ గుట్టుగా మర్యాదగా బ్రతికాము. ఇక బిడ్డలు కలగరేమో అనుకునే సమయంలో నువ్వు పుట్టావు. ఎంతో ఆనందంతో నిన్ను పెంచి, పెండ్లి చేశాము. కాని నీ దురదృష్టం కొద్దీ నీకి వెధవరికం దాపరించింది. నీ బాధను మా బాధగా తలుచుకొని కడుపులో పెట్టుకొని, నీకు ఏ చీకూ చింతా వుండకూడదని, నువ్వు సంతోషంగా వుండేటట్లు పెంచాము. అందుకే నువ్వు బొట్టు పెట్టుకుంటున్నా వని ఎంతోమంది ఎన్నో విధాల మాట్లాడినా కనీసం నిన్ను మందలించనుకూడా మాకు చేతకాలేదు తల్లీ. కాని చివరికి యిలాంటి యిబ్బంది వస్తుందనీ, నీ జీవితం యిలా నాశనమయిపోతుందనీ మేం కలలో కూడా అనుకోలేదు. నీ యీ కష్టదశలో నిన్ను ఓదార్చే శక్తి మాకు లేదమ్మా. ప్రపంచాన్ని ఎదిరించే శక్తికూడా లేదు. అందుకే నిన్ను యింట్లోనుంచి వెళ్ళగొట్టలేక మేమే వెళ్ళిపోతున్నా మమ్మా. మేము చనిపోయామనే అనుకో తల్లీ. మా గురించి వెతికికూడా ప్రయోజనముండదు. భగవంతుడే నిన్ను కాపాడాలి.

ఇట్లు
నీ తల్లితండ్రులు.

అమ్మా, నాన్నా, అంటూ బావురుమంది సుగుణ. కాని ఏమి చెయ్యగలదు. పాపం బయటపడింది. అందరినీ అడిగింది. వాళ్ళేదారిని వెళ్ళారో ఎవరైనా చూస్తే చెప్పమని ఎంతో ప్రాధేయపడి అడిగింది. 'ఇంకేదారుందమ్మా, ఆళ్ళకి ఎళ్ళడానికి. ఆ గోదారేగా' అంది అంట్లుతోమే యెరకలిది.

కళ్ళు మూసినా, తెరచినా అంధకారంగా వుంది సుగుణకి. దారీ తెన్నూ కనబడక ఒక అరుగుమీద కూర్చుండిపోయింది. దారి లేక సొమ్మసిల్లింది. సుబ్బన్న బజారునుంచి వస్తూ సుగుణ ఎవరి అరుగుమీదో పడుండం చూశాడు. మెల్లగా లేపి యింటికి తీసుకుపోయాడు. పరిస్థితి అంతా విని జాలిపడ్డాడు సుబ్బన్న. తన యింటికి తీసుకుపోవడానికి భయం. అసలే తన పెళ్లాం గయ్యాళిగంప. ఏమీ తోచక ప్రకాశం దగ్గరకు వెళ్ళి పరిస్థితి అంతా చెప్పాడు. కొంత డబ్బు తీసుకొని ఆమెను ఓదార్చి ప్రకాశానికి చాలా కాలం నుంచీ వంట్లో బాగులేదనీ, అందుచేత రాలేకపోయాడనీ బొంకాడు. త్వరలోనే వస్తాడనికూడా చెప్పాడు. కాని ప్రకాశరావు మళ్ళీ రానేలేదు.

## 3

నెలలు నిండాయి. సుబ్బన్న యెరకలదాని సహాయంతో ఎలాగో పురుడు పోయించాడు. మగపిల్లవాడు పుట్టాడు. సుబ్బన్న ఆ యింటికి వస్తూ పోతూ వుండడం ఊళ్ళోవాళ్ళందరికీ అనుమానం కలిగించె. మెల్లిగా కూపీ లాగారు. నిజం తేలిపోయింది. ఆ నోట ఆ నోట విషయం మెల్లిగా జమీందారుగారి చెవిలో పడింది. నిర్ఘాంతపోయాడాయన. తన కొడుకు యింతటి అఘాయిత్యం చేసింది నమ్మలేకపోయాడు. ఛీ, ఛీ, ఆ ముండే ఏదో మాయ చేసుంటుంది—

సుబ్బన్నను పిలిపించారు - సంగతి చెప్పమని బలవంతంచేశారు. చెట్టుకు కట్టి జమీందారుగారు స్వయంగా కొరడాతో కొట్టి చెప్పమన్నారు — నోరిప్పలేదు సుబ్బన్న. స్మారకం లేని సుబ్బన్నను అక్కడే కట్లు విప్పి పడవేశారు. అంతా మేడమీదనుంచి చాటుగా చూస్తూనే వున్నాడు ప్రకాశం. సుబ్బన్న యిక్కడ నిజం చెప్పేస్తాడేమో నన్న భయంతప్ప సుబ్బన్న తనమూలంగా ఇంత బాధ అనుభవిస్తున్నాడే అనే జాలి అతనిలో కలగలేదు. అసలు ఆ విషయమే అలవాటులేదు ఆ జీవికి. సంతోషించాడు సుబ్బన్న మౌనానికి. కాని తండ్రి తననే అడిగితే యేమి సమాధానం చెప్పాలో తెలియక తికమక పడుతున్నాడు.

తండ్రి కూడా తన కసలా సంగతే తెలియనట్లుండిపోయాడు. ఎంతైనా జమీందారు సంతతికదా. ఒకవేళ నోరు తెరచి అడిగితే అవునన్నాడంటే తరవాత సంగతేమిటి - బాగా ఆలోచించుకున్నారు జమీందారు మురళీధరరావుగారు. తన యేకైక పుత్రునికి యేదో మరొక పెద్దజమీందారు బిడ్డను తెచ్చి కట్టా లనుకుంటున్నాడాయె. ఈ సమయంలో ప్రకాశరావు 'కాదు' నే నా పిల్లకు అన్యాయం చేశాను. కనుక నేను దానినే కట్టుకుంటా' నంటాడేమో నన్న భయం వేసింది. అందుచేత పరిస్థితులను మౌనంతో గౌరవంగా సాధించడమే మంచి దని నిశ్చయించుకున్నాడాయన.

ఆ సంగతి యెన్నడూ ప్రకాశరావు దగ్గర తేలేదు. ఇది మరీ భయమనిపించింది ప్రకాశరావు పిరికిగుండెకు. మంచ మెక్కాడు. జ్వరం తీవ్రంగా రావడం ప్రారంభించింది. కాకినడా తీసుకొచ్చారు. నిపుణులైన వైద్యులంతా పరీక్ష చేశారు. మందు లిప్పించారు. జ్వరమయితే తగ్గింది. మనిషి మనలో లేడన్నారు. పిచ్చవాలకం వచ్చింది. బంధువు లెవరైనా తనను చూడడానికి వస్తే - వారిని తేరపార చూసి ఎవరికోసమో వెతుకుతున్నట్లు, వాళ్ళందరినీ పరిశీలించేవాడు. యెవరితోనూ మాట్లాడేవాడుకాదు. తండ్రి వస్తే గట్టిగా కళ్ళు మూసుకుని పడుకునేవాడు.

ఏదో మానసిక బాధ వున్నట్లుగా కనిపిస్తున్నా డని కొందరు నిపుణులు చెప్పారు. పైగా చిన్నప్పటినుంచీ వున్న వాతావరణం మారడంచేతకూడా యిట్లా జరగొచ్చు కాబట్టి మామూలు స్థలానికే మార్చమన్నారు. జమీందారుగారు చేసేది లేక తిరిగి వాళ్ళవూరికే తీసుకుపోయారు. కాని యీసారి మరొక తెలివైనపని చేశారు. ముందుగా మనుష్యుల్ని పంపించి సుగుణను తనవూళ్ళో లేకుండా బయటకు గెంటేయమన్నారు. పాపం, పసికూనతో ఊరిబయటి అడవిలో చెట్లక్రింద చలి బాధతో కష్టపడుతున్న బాలింతరాలిని కనికరించి ఒక పాక వేసిపెట్టాడు సుబ్బన్న. ఆ కారణంగా అతనుకూడా వూళ్లోనించి గెంటివేయబడ్డాడు.

గత్యంతరం లేక తనుకూడా ఆప్రక్కనే ఒక కొంప వేసుకొని జీవితం గడుపుతున్నాడు. పాపం అమాయకురాలైన సుబ్బన్న పెళ్ళాం తన యీ కష్టాలన్నిటికీ కారణమైన సుగుణను బండ బూతులు తిడుతుండేది.

ప్రకాశం స్వంత యింటికి వచ్చాక చాలాకాలానికి మామూలు స్థితిలో పడ్డాడు. సుబ్బన్నను గురించి వాకబు చేశాడు. ఊళ్ళోనుంచి గెంటెయ్యబడ్డా డని తెలిసింది కాని ఎక్కడ వున్నాడో ఎవరికీ తెలియలేదు. మరి సుగుణ గురించి ఎట్లా తెలుసుకోవడం. ఎవరినీ అడిగే ధైర్యం లేదాయె - సుబ్బన్న బదులు, కొత్తగా ఉద్యోగంలోకి వచ్చిన బండివాడ్ని మెల్లిగా ధైర్యం తెచ్చుకొని, ఏదో యాదాలాపంగా అడిగినట్లు "రిటైర్డు పోస్టుమాస్టరు పార్వతీశంగారు రేమయ్యారోయ్, అసలామధ్య కనిపించడమే లేదు. నాన్నగారిదగ్గరకుకూడా వస్తునట్లు లేదే" అని అడిగాడు. దాంతో అంతకు ముందే తరిఫీదు యివ్వబడ్డ బండివాడు వరసగా చెప్పడం మొదలెట్టాడు. "పార్వతీశంగారూ, ఆయన పెళ్ళామూ వూరు వదిలి వెళ్ళిపోయారండీ. ఆ రమ్మాయి వుంది చూసారూ ఎదవది, దానికి కడుపొచ్చిందికదండీ - అందుకని గోదార్లో పడి చచ్చిపోయింది బాబూ.'' వాడిపని పూర్తయినట్లు వెళ్ళిపోయాడు బండివాడు.

ప్రకాశానికి మతి పోయింది. అనుకోకుండా కళ్ళంట నీళ్ళు కారాయి. గదిలో బోరున యేడ్చాడు. తనని తాను తిట్టుకున్నాడు. సుగుణను తనే హత్య చేశాననీ, తనకి శిక్ష కావాలనీ, అప్పుడుగాని ప్రాయశ్చిత్తం లేదనీ దేవుళ్ళకు మొక్కుకొన్నాడు. అసలు దేవుళ్ళకు ఈ రొమాన్సు గొడవలు మామూలవటంచేత కాబోలు ప్రకాశం కోరిక మన్నించలేకపోయారు.

## 4

నాలుగు సంవత్సరాలు గడిచింది. సుగుణ చనిపోయిందనే ప్రకాశం నమ్మాడు. కాని యీ నాలుగు సంవత్సరాలలో అతనిలో ఒక విధమైన మార్పు కలిగింది. ఒక అమాయకపు స్త్రీని మోసం చేశాననే బాధ ప్రతిక్షణమూ అతనిని వెంటాడడం మొదలుపెట్టింది. పదే పదే ఆలోచించడంచేత అతనిలో ఒక విధమైన చైతన్యం కలిగింది. అనేకసార్లు తండ్రి తన వివాహం సంగతి తెచ్చాడు; కాని ప్రకాశరావు 'యింకా కొంతకాలం యిలాగే వుండాలనుంది' అని తప్పించుకునేవాడు. తండ్రికిమాత్రం అనుమానంగానే వుండేది. ఒకవేళ సుగుణ బ్రతికున్న సంగతి ప్రకాశానికి తెలిసిందేమో నని అనుమాన పడేవాడు.

కాలం గడుస్తూవుంది. సుగుణ ప్రక్కవూరిలో ఒక ముసలి బ్రాహ్మణుని యింటిలో వంట చేస్తూ తనూ, తన బిడ్డా జీవితం గడుపుతున్నారు. రోజులు జరుగుతున్నకొద్దీ తమ యీ దుస్థితికి కారకుడైన ప్రకాశరావుమీద అసహ్యం, కోపం కూడా యెక్కువయ్యాయి. ఉన్నట్టుండి, ఒక రోజున సుగుణ కొడుకు మురళి హటాత్తుగా జ్వరపడ్డాడు. వంటపనికి వెళ్లాలో లేక యింటిదగ్గిర మురళిని కనిపెట్టుకు నుండాలో తెలియలేదు. బిడ్డను సుబ్బన్నకు అప్పజెప్పి మామూలు వుద్యోగానికి బయలుదేరింది సుగుణ. త్వరగా పంతులుగారికి వంట చేసిపెట్టి ఆ రోజుకు సెలవు తీసుకుంది.

కమ్మరి చంద్రయ్యదగ్గరకు వెళ్ళి జ్వరలక్షణాలు చెప్పి కషాయానికి కావలసిన మూలికలు తీసుకొని ఆదుర్దాగా యింటికి వస్తున్న సుగుణకు దూరంలో సుబ్బన్న పరుగెత్తుకు రావడం కనిపించింది. మనిషి చాలా కంగారుగా వున్నాడు. దగ్గర కొచ్చి త్వరగా రమ్మని మళ్ళీ వెనక్కు పరుగెడ్తున్నాడు. ఏ సంగతీ చెప్పకుండానే తను పరుగెత్తడం మొదలుపెట్టింది. ఇంటికిచేరేసరికివిషయం తెల్సింది. రక్తపుమరకలతో పడివున్నాడు మురళి. పాపం తను వెళ్ళడంతోటే వెనకాలే బిడ్డకూడా లేచి రావడం చూడలేదామె. తను అవసరంగా వెళ్ళడంచేత బిడ్డ దారితప్పి వూళ్ళోకి వెళ్ళసాగాడు. జమీందారుగారి బండి అటు వేగంగా వస్తూంది. అడ్డువచ్చిన కుర్రాడిని చూడకుండానే తోలేసాడా బండివాడు. చక్రంకిందపడి చనిపోయాడు మురళి.

కష్టాలకు పుట్టిల్లయిపోయిన సుగుణ హృదయంలో ఈ కొత్తకష్టం గాయం కలిగించలేకపోయింది కాబోలు! వికటంగా నవ్వసాగింది సుగుణ. సుబ్బన్న కంగారు పడ్డాడు. ఏడుస్తున్నాడు. అతనిని చూచి ఒక్కసారి తనూ యేడిచింది. మళ్ళీ నవ్వసాగింది. ఇలా యేడుపూ, నవ్వూ మీరి మీరి వస్తున్నాయి. 'మురళీ' నా బిడ్డ, ఏడీ, ఏడీ' అంటూ వూళ్ళో పడింది. సుబ్బన్నా అతనిభార్యా ఆపడానికి యెంత ప్రయత్నించినా లాభంలేకపోయింది.

వీథులెమ్మట పడిన ఆ పిచ్చిదాన్ని చూసి కొందరు జాలిపడ్డారు; కాని జాలి పడ్డసంగతి జమీందారుకు తెలిస్తే యేమి ముప్పు వస్తుందో నని యెవరూ ఆమెకు యేమీ సహాయం చేయలేదు. పైగా ఆమె సహాయాన్ని పొందగలిగే మనస్థిమితముకూడా లేదాయె.

జమీందారుగా రామెను వెంటనే వూళ్ళోనించి గెంటించ మన్నారు — ఊరుబయట స్మశానంలో మురళిని మట్టి చేసినచోట కూర్చుని మురళీ! మురళీ! అని యేడ్చింది. ప్రతిరోజూ రాత్రంతా అదేపని. పైవూరు వెళ్ళినవాళ్ళెవరైనా చీకట్లో తిరిగివచ్చేటప్పుడు ఊరిబయట స్మశానంలోంచి వచ్చే ఈ ఆర్తనాదం వాళ్ళ గుండెలను చీలుస్తూ భయం కలిగించేది. పైగా ఒక్కొక్కప్పుడు చీకట్లో రోడ్డుమీదకు వచ్చి నిలబడి వుండేది సుగుణ. ఎవరైనా ఆదారినివస్తే గబుక్కున, 'నా మురళిని చూశారా మీరు' అని వికటంగా నవ్వుతూ, ఏడుస్తూ అడిగేది. అందుచేత వూళ్ళోవాళ్ళు ఎవరూ చీకటి పడింతరువాత వూరిబయటకు వెళ్ళడం మానేశారు. నిద్రాహారాలు లేకుండా ఎన్నాళ్ళు అలా గడిపిందో ఎవరికీ తెలీదు. సుబ్బన్న యింక బ్రతిమాలినా యింటికి వెళ్ళేదికాదు.

ఈ సంగతి ఎలాగో ప్రకాశానికి తెలిసింది. సుగుణ బ్రతికున్నందుకు సంతోషించాడు గాని ఎలా వెళ్ళి చూడడం. ఇప్పటికైనా మగవాడివి కమ్మని హృదయం తట్టి లేపింది. చిన్నప్పుడే ఏమూలో అణగారిపోయిన జమీందారీ పౌరుషం ఒక్కసారే పొంగి పొర్లింది.

రాత్రి 8 గంటలకు వున్నట్టుండి బ్యాట్రీ లైటు తీసుకొని బయలుదేరాడు ప్రకాశం. గుఱ్ఱానికి జీను కట్టి ఎక్కాడు. బయటకు వచ్చేసరికి, మేడమీదనుంచి తండ్రి కేక వినిపించింది.

''ఎక్కడికిరా ప్రయాణం?''

— — ప్రకాశం ఆగాడు, కాని సమాధానంలేదు. వెనక్కు తిరిగికూడా చూడలేదు. తండ్రి ముఖం చూస్తే తనలోని పటుత్వం తగ్గిపోతుందేమో నని, సమాధానం చెప్పకుండానే ముందుకు గుఱ్ఱాన్ని అదిలించాడు.

''అడిగితే సమాధానం చెప్పవేంరా?'' అని గద్దించాడు తండ్రి. ధైర్యంగా ఒక్కసారి వెనక్కు తిరిగి ''నా ప్రేయసి దగ్గరకు వెళుతున్నా'' నన్నాడు.

"ఆగు, అడుగు ముందుకు వేశావంటే కాల్చేస్తా" నన్నాడు, గౌరవంకోసమే పుట్టి పెరుగుతున్న జమీందారు మురళీధరరావుగారు.

ప్రకాశరావు ముఖం కందిపోయింది. కంపించిపోయాడు మనిషి. కాని భయంతో కాదు కోపంతో. ''నన్ను కాలుస్తావా నాన్నా. కాల్చుధైర్యముంటే" అన్నాడు బోర యిరుచుకొని.

అలాగే నిలబడిపోయాడు జమీందారుగారు.

ప్రకాశరావు గుఱ్ఱాన్ని తిప్పి వేగంగా స్మశానంవేపు దవుడు తీయించాడు. స్మశానమంతా గాడాంధకారంగా వుంది.

అంతా నిశ్శబ్దం. ఎక్కడైనా యేడుపు వినుపిస్తుందేమో నని చెవులు నిక్కబొడుచుకొని విన్నాడు. గుండె చెదిరిపోయేటట్లు అరుస్తూ తీతువుపిట్ట నెత్తిమీదుగా యెగిరిపోయింది.

బ్యాట్రీ లైటు వెలుతురులోనే స్మశానమంతా గాలించాడు. ఒకచోట చిన్నగోరీ మీద పడివున్న సుగుణను చూశాడు. నిద్రపోతోందేమో ననుకుని పిలిచాడు. ప్రకాశరావు గొంతు విని మెల్లిగా లేచింది సుగుణ. ఆనవాలు పట్టింది. పక్కున నవ్వింది. వెంటనే యేడవడం ప్రారంభించింది. ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నాడు ప్రకాశరావు. లాభం లేకపోయింది. ఇంతలో సుబ్బన్న రావడం చూశాడు.

"సుబ్బన్నా సుగుణ చనిపోయిం దని అందరూ నాతో చెప్పారు. కనీసం ఈ పరిస్థితిలో వుందన్న సంగతి కూడా నాకు చెప్పలేదే'' మని అడిగాడు.

''బాబూ, ఊళ్లో కనిపిస్తే చంపేస్తామని బెదిరించారు. నే నెలా రాగలను బాబూ. అందులోనూ దివాణంలోపలే వుంటున్న మీ దగ్గరకు వచ్చి విషయం చెప్పేదెలాగు. ఎప్పుడైనా షికారుకు ఊరుబయటకు వస్తారేమో నని ఎన్నోరోజులు చూశాను. కాని మీరు రానేలేదు. ఏం చేస్తాం బాబూ. అంతా కర్మ'' అన్నాడు.

"సుబ్బన్నా, నా కొక చిన్న సహాయం చేస్తావా.''

"ఏమిటి బాబూ?''

"ఈమె నడిచే స్థితిలో కూడా లేదు. ఏదైనా ఒక బండి తీసుకురా. ఈమెను వెంటనే దివాణానికి చేర్చాలి."

"బాబూ, అయ్యగారు ఊరుకుంటారా? కొంపలమీదికొస్తుంది బాబూ."

"రానీయవయ్యా. ఎంతవరకూ వస్తుందో చూస్తాను. ఈ ఎస్టేటు ఏమీ ఆయన స్వార్జితంకాదు. మా తాతగారిది. దీని మీద సర్వహక్కులు నాకున్నాయి. ఆ సంగతి తర్వాత చూసుకుందాములే. ముందు బండి తీసుకురా.''

సుబ్బన్న వెళ్ళాడు.

తిరిగి చూసేటప్పటికి సుగుణ తనకేసి తీవ్రంగా చూడడం గమనించాడు ప్రకాశరావు.

''ఏం సుగుణా, అలా చూస్తున్నావు'' అన్నాడు.

''మీరు చచ్చిపోయారటగా. మళ్ళీ ఎప్పుడు బ్రతికారు'' అని అడిగింది.

నిర్ఘాంత పోయాడు. కొంత సేపటికి తెప్పరిల్లి ''నిజమే సుగుణా, నేను చాలా కాలం చచ్చేవున్నాను. ఈమధ్యనే మళ్ళీ బ్రతికాను'' అన్నాడు బాధతో.

పకపకా నవ్వింది సుగుణ.

సుబ్బన్న సహాయంతో బలవంతంగా బండెక్కించాడు సుగుణను. దివాణం సమీపంలోకి వచ్చేసరికి సుబ్బన్నకు వణుకు పట్టుకుంది. జమీందారుగారు మేడమీదనుంచి చూస్తూనే వున్నాడు. చేతిలో తుపాకీ వుంది.

భయంతో 'బాబూ' అన్నాడు సుబ్బన్న.

ప్రకాశం సమాధానం చెప్పలేదు. సుగుణను మెల్లగా సాయంపట్టి దింపారు. మెల్లగా నడిపిస్తూ దివాణంలోకి తీసుకెళ్లారు. సుగుణ మామూలుగా సొంత యింట్లోకి నడిచినట్లుగానే నడిచింది. అంతా పైనుంచి చూస్తూనేవున్నారు జమీందారుగారు. సుగుణను తన గదిలోకి తీసుకుపోయి పడుకోపెట్టాడు ప్రకాశరావు. డాక్టరును తీసుకురావడానికి సుబ్బన్నకు డబ్బిచ్చి కాకినాడ వెళ్ళమన్నాడు.




ఒక్కసారే ఢాం అనే శబ్దం మేడమీద నుంచి వినిపించింది. అందరూ పరుగెత్తారు. జమీందారు మురళీధరరావుగారు తన గదిలో పడివున్నాడు, రక్తపు మడుగులో. చేతిలో తుపాకి వుంది.